# సైగల్

హాలీవుడ్ యాక్టర్లా నవ్వేడు రామారావు, పరిచమెలెవరో వెళుతూంటే వాళ్ళని చూసి. వాళ్ళు కూడా దూరం నుంచే పలకరించి నవ్వి, అలానే సాగిపోయేరు.

వాళ్ళవి హాలీవుడ్ యాక్టర్ల నవ్వులు కావు.

రామారావుదే హాలీవుడ్ యాక్టర్ నవ్వు. సాయంకాలం ఆరుగంటలయింది. బీచిరోడ్డుని పేవ్‌మెంట్‌మీద, సింగారించుకొన్న ఆడవాళ్ళు వయ్యారంగా నడుస్తున్నారు. మగవాళ్ళు కూడా వాళ్ళల్లాగే సింగారించుకొని వాళ్లల్లాగే నడుస్తున్నారు. పురపాలక సంఘంవారు తమకొక రేడియో సెట్టు ఉందని అందరికీ తెలియజేస్తున్నారు. వింటే సంగీతమని తెలుస్తుంది. ఎవ్వరూ వినడంలేదు.

పేవ్‌మెంటుకి పక్కగా కారాపి అప్పుడే అందులోంచి దిగేడు రామారావు. దిగి, ఠీవిగా పైప్ కాలుస్తూ పేవ్‌మెంటుమీద కాస్సేపు నిల్చున్నాడు.

రామారావూ, కాంతారావూ అయిదో క్లాసు వరకూ కలిసి చదువుకున్నారు. తరువాత విడిపోయేరు. రామారావు ఆనర్స్ పాసయేక ఉద్యోగం అన్వేషిస్తూ "ఇంటర్‌వ్యూ" కోసం మద్రాస్ వెళ్ళినప్పుడు, హోటేల్ గదిలోంచి పొద్దున్నే లేచి బైటకి వస్తూంటే ఎదట గదిలోంచి ఒక కొత్త ముఖం, కాని ఎక్కడో చూసిన ముఖం బైటకి వచ్చింది. చూస్తే ఇంకెవరు? కాంతారావు. కుశల ప్రశ్నలూ వగైరాలన్నీ అయాక ఆరోజే అప్పుడే అన్నాడు కాంతారావు, "నవ్వినప్పుడు నువ్వు హాలీవుడ్ యాక్టర్లా ఉంటావోయ్" అని.

ఆ హాలీవుడ్ యాక్టర్ పేరు కూడా చెప్పేడు కాంతారావు.

అయితే, మళ్ళీ గిజామన్నా జ్ఞప్తికి రాలేదా పేరు రామారావుకి.

అది అతనికి చాలా ఎగ్జాస్పరేటింగ్‌గా ఉంటూ ఉంటుంది. హాలీవుడ్ యాక్టర్ల పేర్లన్నీ జాబితావేసి చూసినా, ఏ పేరుకా పేరు కాంతారావు చెప్పినదాన్లా అనిపిస్తుంది. కాని, ఏ పేరు కాపేరే "ఉహుం, ఇది కాద"నిపిస్తుంది.

పోనీ, కాంతారావునే కనుక్కుందామంటే -

లేచిన వేళావిశేషం వల్లనో, లేక లేవగానే రామారావు ముఖం చూసిన దోషం వల్లనో ఆరోజు మధ్యాహ్నమే హోటేల్ మేడ మెట్టుమీద కాలు జారింది కాంతారావుకి. మీద మెట్టు నుంచి కింద మెట్టుకి వచ్చేలోపల ఎమికలు విరిగేయి, తల పగిలింది, స్పృహ తప్పింది, మరో ఘడియకి ప్రాణం పోయింది.

ఎవరైనా చనిపోయారూ అంటే రామారావు విచారించడు. తండ్రి పోయినప్పుడు అతనికి

ఏడుపు రాలేదు. ఆస్తి వచ్చింది. తల్లిపోయినప్పుడు అతనికి ఆస్తి రాలేదు. కొంచెం కన్నీరు వచ్చింది. ఆ తల్లి తన బంగారం అంతా కూడా "కూతురుముండ"కే ఇచ్చేసినందుకు ఏడుపుకూడా వచ్చింది. అటువంటి మనిషి కాంతారావు చావుకి ఎందుకు విచారిస్తాడు? విచారించలేదు.

కాంతారావు లేనందుకు విచారిస్తూ ఉంటాడు రామారావు.

కాంతారావే ఉన్నట్లయితే ఆ హాలీవుడ్ యాక్టర్ పేరేదో మూణ్నిమిషాల్లో తెలిసి పోయుండును.

కాని, విచారించి ప్రయోజనం లేదు.

చచ్చి స్వర్గాన ఉన్నవాళ్ళు తిరిగి కిందకి దిగిరారు.

అలా తిరిగి కిందకి దిగిరాకపోడం ఉందే అదీ రామారావు మంచికే!

ఒక్క కాంతారావు తప్ప, చచ్చి స్వర్గాన్న ఉన్న వారెవ్వరూ కూడా దిగి రావడం ఇష్టం వుండదు రామారావుకి.

అందులోనూ ముఖ్యంగా కొంతమంది దిగివచ్చేరూ అంటే, ఉన్నదన్నమాటే తంటా.

తండ్రి తిరిగి వచ్చేడూ అంటే ఇచ్చిన ఆస్తి పట్టుకుపోతాడు. తల్లి దిగివచ్చిందీ అంటే ఆవిడగారు కాణీ ఇవ్వకపోడం సరికదా, పైగా పోషించమని పీకలమీద సవారీ అయి కూర్చొంటుంది. "కూతురుముండ" దిగిరావడానికి అదింకా చావనేలేదు.

వీళ్ళమాట అలా ఉంచగా ఇహ నా సావిత్రే కాని దిగివచ్చిందీ అంటే అదొక గొప్పతంటా.

జానకిరామయ్యగారి కూతురే సావిత్రి.

అరవయ్యేళ్ళే బతికినా ఆ కాలంలో ఓ నాలుగైదు లకారాలైనా గడించేడు జానకిరామయ్య. "ఏడంచేత్తో గణించి పారేశాడయ్యా" అని లోకులు గొప్పగా చెప్తూ ఉంటారు డబ్బు గడించిన వాళ్ళ గురించి. జానకిరామయ్య కుడీ యెడమా లేకుండా గడించేడు. ఆ మాట నిజం, కాని పారేశాడన్నమాట శుద్ధాబద్ధం. అంత డబ్బునీ పాతరవేసేడు జానకిరామయ్య.

డబ్బు మూలుగుతుందంటారు.

నిజనిజాలు డబ్బున్నవాళ్ళకి తెలియాలి.

సావిత్రి మాత్రం క్షయ జబ్బుతో మూల్గేది.

సావిత్రికి క్షయన్న భోగట్టా రామారావుకి తెలుసు. అందువల్లనే ఆమెకి పెళ్ళి కాలేదన్న సంగతి కూడా తెలుసు. తండ్రి కామె ఒక్కర్తే సంతానం అన్న విషయం బాగా తెలుసు. ఇవన్నీ తెలిసినవాడికి జానకిరామయ్య దగ్గర డబ్బు మూలుగుతోందన్న సంగతి తెలీదూ? తెలీదన్నవాడు ఒట్టి పూలు.

డబ్బుందని తెలుసు కాబట్టే సావిత్రిని పెళ్ళాడ్డానికి ఒప్పుకున్నాడు రామారావు.

సంబంధం స్థిరపడింది.

కాని పెళ్ళయే లోపున రామారావుకి ఓ సందేహం కలిగింది.

కట్నం కింద ఓ పదివేలు పారేస్తున్నాడే కాని తీరా పెళ్ళయేక ముసలాడికి ఏం బుద్ధి పుడుతుందో ఏమో ఎవడికి తెలుసు? మిగతా ఆస్తంతా ధర్మసత్రవులకి రాసిచ్చేస్తే! ఏ దౌర్భాగ్యుణ్నో దత్తత చేసుకొంటే! వీటికంటే గొప్ప ప్రమాదం; మళ్ళీ ఏముండనో చూసి పెళ్ళాడేస్తే!

అప్పుడు రామారావూ, రామారావు జబ్బు పెళ్ళాం కలిసి కట్టకట్టుకొని గంగలోకి దిగాలి.

అందుచేత గొప్ప పేచీ కొట్టేడు రామారావు.

ఆ పేచీ కొట్టడంలో కొడుక్కి తండ్రి సాయపడ్డాడు అటువంటి విషయాల్లో తండ్రీ కొడుకుల మధ్య చిక్కటి సంపతీ ఉండేది.

కట్నాలు నిర్ణయించుకున్నారు. కానుకలు నిర్ణయించుకున్నారు. ముహూర్తం స్థిరపర్చేరు; శుభలేఖలు పమ్మించనిచ్చేరు

అప్పుడు;

అంటే, ఇక రెండురోజులు ముహూర్తం ఉందనగా అందేట్టుగా, టైమ్‌బాంబులా ఓ రిజిస్ట్రీ నోటీసు జానకిరామయ్యకి పంపించేడు రామారావు.

నీ కూతురికి టి.బి. ఉంది ఆ సంగతి నాకు తెలీనీకుండా మభ్యపర్చి దగా చేసేవు. యధార్థం కప్పిపుచ్చి స్థిరబరచిన ఈ సంబంధం చెల్లనేరదుః నాకు అక్కరలేదు. కాగా నీవు చేసిన ఈ దగావల్ల నాకు కలిగిన నష్టానికీ, మనఃక్లేశానికీ, పరువు నష్టానికీ డామేజెస్ నిమిత్తం సివిలు కోర్టులో దావా చేయడమే కాకుండా, నీపైని క్రిమినలు చర్యలు కూడా జరిపించడమగును.

అదీ ఆ నోటీసు సారాంశం.

తాటాకు చప్పుళ్ళకి కుందేళ్ళు జడవ్వట, జానకిరామయ్యకూడా జడవడు. అతని దగ్గర నోటీసంటే నోటీసే కాని అదేం టైంబాంబు కాదు. అతన్ది దావాల్లోనూ తంటాల్లోనూ బాగా నలిగిన చెయ్యి. రిజిస్ట్రీ నోటీసు భాగోతాలకి భయపడే మనిషి కాదు.

కాని -

తన దారుఢ్యం తగ్గిపోతోంది. కూతురి వయసు పెరుగుతోంది. ఇప్పుడు పెళ్ళాగిపోతే నామోషీ, అప్రతిష్ట రసాభాసవుతుంది. పిల్లకి మరింక ఈ జన్మలో పెళ్ళికాదు.

"వెధవకి మరికొంత డబ్బు కావాలి. అదీ దీని అర్థం" అనుకున్నాడు నోటీసు అందుకొని.

పెళ్ళాగిపోదన్న ధీమా అతనికి ఉంది.

ఆగిపోదన్న ధీమా లేకపోతే రామారావు కూడా పమ్మించడు నోటీసు

పెళ్ళి యథావిధిగా జరిగింది.

జానకిరామయ్యగారి ఆస్తిలో సగంలో సావిత్రికి జీవితపు హక్కు. ఆమె తదనంతరం

ఆ ఆస్తిపై ఆమె సంతానానికి పూర్తి హక్కు.

అలా సెటిలయింది తగవు.

కాపరానికొచ్చింది సావిత్రి.

కాపరానికొచ్చిందే కాని పిల్లలు పుట్టకుండానే చచ్చిపోతుందేమోనని తెగ భయపడిపోయేడు రామారావు.

రామారావు చదువుకోనివాడు కాడు. పిల్లలు పుట్టడం ఆమెకి ప్రమాదకరం అని అతనికి తెలియకపోలేదు.

పిల్లలు పుడితే చస్తుంది.

నిజమే.

పిల్లలు పుట్టకపోతే మాత్రం ఆ క్షయ జబ్బుతో ఎన్నాళ్ళు బతుకుతుంది?

పిల్లలుంటే తాత ఆస్తీ, తల్లి ఆస్తీ కూడా వాళ్ళే అనుభవిస్తారు. పిల్లల్లేకపోతే జానకిరామయ్యగాడి ఏ జ్ఞాతి వెధవలో ఇంత ఆస్తినీ ఎగరదన్నుకుపోతారు. అలా జరగడం వాళ్ళకి శ్రేయస్కరమే కాని రామారావుకి శ్రేయస్కరం కాదే.

అందుచేత భార్య చావగా కొడుకుని ఎత్తుకున్నాడు రామారావు.

తల్లిలాగే ఉన్నాడు కొడుకు.

అది మరో భయానికి కారణం.

తాత చావకముందే మనవడు చస్తే, తాత ఇంకా తనకిందే ఉంచుకున్న ఆస్తంతా తిరిగి ఎవరో ఆ జ్ఞాతి వెధవలకే పోతుంది.

అందుచేత,

ఆ పిల్లడు చావాలని జ్ఞాతులూ, చావకూడదని రామారావూ భగవంతుణ్ని ప్రార్థించడం జరిగింది.

ఈలోపున జరిగింది ఓ ఘోరం.

కూతురు చనిపోయాక, విరక్తుడైన జానకిరామయ్య తనకున్న ఆస్తినంతటినీ ఓ "చచ్చు యూనివర్సిటీ"కి దానం చేసి పారేసి, ఊరు విడిచి, కాశీపోయి, ప్రయాగ చూసి, హరిద్వారంలో హరీమన్నాడు.

జానకిరామయ్య చావడం కాదు వాడా డబ్బంతా అలా తగలెట్టడం అదీ జరిగిన ఘోరం.

ఆ వార్త విన్నప్పుడు రామారావు ముఖం చూసి తీరవలసిందే. అప్పుడతని ముఖంలో హాలీవుడ్ యాక్టర్ నవ్వులేదు. నవ్వే లేదు. ముఖం అంతా మంటలు మండింది కోపంతో. ఆ మంటలు మావఁగాడు చచ్చేడన్నమాట విన్నాక్కాని పూర్తిగా చల్లార్లేదు.

జానకిరామయ్య చచ్చిపోయాడన్న సంగతి తెలిసి సానుభూతి తెలిపే నిమిత్తం ఓ పెద్దమనిషి రామారావింటికి వచ్చి రామారావుని చూసి ఆశ్చర్యపడ్డాడు. షాకయేడు.

రామారావు కొడుకు చనిపోయినప్పుడు తిరిగి ఆ పెద్దమనిషే వచ్చినట్లయితే అతగాడు మరీ ఆశ్చర్యపోయి, ఇంకా హెచ్చుగా షాకయిపోయుండును.

మూడోఏట పోయేడు రామారావు కొడుకు.

ఆ వెంటనే రెండో పెళ్ళి చేసుకున్నాడు రామారావు.

రామారావుకి ఇప్పుడు ముగ్గురు కొడుకులున్నారన్న సంగతి కొంతమందికి తెలుసు. అతనికిప్పుడు దాదాపు నాలుగు లక్షల కిమ్మత్తు చేసే స్థిరాస్తి ఉందని చాలామందికి తెలుసు. అంతకి డబుల్‌గా అతని దగ్గిర క్యాష్ ఉందన్న భోగట్టా ఇన్‌కంటాక్సు వారికి తెలీదు.

ఆయా సంగతులు నిద్రలో కూడా మర్చిపోడు రామారావు.

ఒక్కసారి చూస్తే చాలు, మరపుకిరాని విగ్రహం రామారావుది.

మాంచి పొడవు, పొడవుకి తగిన లావు, పొడవుకి లావుకి తగినట్టుగా, పెద్దదీ కాకుండా చిన్నదీ కాకుండా ఉండే సరియైన బొజ్జ, ముఖంలో చిన్న చిరునవ్వు, అంతలోనే గాంభీర్యం, అంతలోనే బ్రాడ్ హాలీవుడ్ యాక్టర్ స్మైల్, పెద్దమనిషని సూచించేట్టుగా తగు మాత్రం బట్టతల. "ముసలాడు కాడుస్మండీ" అన్నట్టుగా, గాలికి కొంచెం ఎగిరేట్టుగా పల్చటి జుట్టు.

నిండైన విగ్రహం ఖరీదైన మనిషి.

పంచె, జుబ్బా, వాణీ వేసుకొంటే ఆ మూడూ ఖరీదైనవే. సూటు వేసుకొంటే అదీ ఖరీదైనదే. కళ్ళకి కూలింగ్ గ్లాసెస్, వేళ్ళకి ఉంగరాలు, రిస్టుకి వాచీ; అవి ఖరీదైనవి కాకుండా పోవు. మోటారుకారుందీ అంటే అది ఖరీదైనది కాదని ఎవడనగలడు?!

పేవ్‌మెంటుమీద కొంచెంసేపే నిల్చున్నాడు రామారావు.

కట్టుకున్న కాస్ట్లీ పంచె సముద్రపు గాలికి తెల్లమబ్బులా మెల్లిగా కదుల్తోంది. పట్టుజుబ్బా గుండెలకీ బొజ్జకీ మెత్తగా వత్తుకొంటోంది.

నోట్లో ఉన్న పైప్‌ని కుడిచేత్తో బైటకి తీసి పొగవదిలేడు రామారావు.

రామారావు నోట్లో చిక్కుకొని కూడా బైటికి తప్పించుకోగలిగినందు క్యాబోలు నీలి పొగ ఆశ్చర్యపోయి ఎటుపోవాలో ఎరక్క గాబరాగా అటూ ఇటూ పరిగెట్టింది.

పరిగెట్టాల్సిన అవసరం రామారావుకి ఇంతవరకూ ఎన్నడూ కలగలేదు. అతను తాజాగా నడుస్తాడు. అతన్ది అరిస్టాక్రటిక్ గెయిట్.

అరిస్టాక్రటిక్ గెయిట్‌తోటే ఇసకలోకి దిగబోయేడు. దిగబోతూండగా ఇంతలో ఎవరో పక్కనుంచి వచ్చి అతనికి కొంచెం పక్కగా కొంచెం ఎదురుగా నిల్చున్నాడు. పక్కనుండి వచ్చిన ఆసామీ మనిషిలా లేడు. నీడలా ఉన్నాడు. "నీడీ"గా ఉన్నాడు.

బికారి, బైరాగి, బెగర్.

కొట్టడానికొచ్చేడా?

రామారావు జంకేడు.

"రామారావుగారూ; క్షమించాలి. కిందటిసారి తమర్ని కలుసుకున్నప్పుడు మొహమాటపడి

అడగలేకపోయేను. చాలా జరుగుడుగా ఉంది. ఒక్క పాతిక రూపాయలు; దయచేసి ధర్మంకిందే అనుకోండి. తమరి కాఫీ ఖర్చుపాటి ఉండదు"

కొట్టడానికి రాలేదని తెలుసుకున్నాక ఒక "విదరింగ్ లుక్" ఇచ్చేడు రామారావు.

"ఈసారిలా అడిగేవు. సరిపోయింది. మళ్ళీ నీ మొహం నాకు చూపించకూడదు తెలిసిందా! దమ్మిడీ అయినా సరే ఇవ్వనుగాక ఇవ్వను. దయచేసి వెళ్ళు."

అని చెప్పేసి ఇసకలోకి చరచరా పాములా సాగిపోయేడు రామారావు.

బెగర్స్ బెగర్స్! అడుగుతీసి అడుగు వేస్తే ఏ బెగ్గరో ఓ బెగ్గరెదురు!

అయితే -

పాతిక రూపాయలు 'బెగ్' చేసినవాడు మొదట్లో బెగ్గరుకాడు. ఇప్పుడైతే అనామకుడయేడు. అప్పుడతను వెంకట్రావు. రామారావుకి అతను బాగా పరిచయుడు. అతణ్ని నోరుజార్చి ఎవరైనా డబ్బడగడం భయం ....

అలా ఖర్చు చేసేసేడు.

ప్రస్తుతం ఇలా ముస్టెత్తుతూ తిరువీధులూ తిరుగుతున్నాడు. వెంకట్రావుని చూస్తే రామారావుకి అప్పట్లో కూడా ఇష్టం ఉండేదికాదు.

ఒళ్లెరక్కుండా ఎవడు ఖర్చు పెట్టమన్నాడలాగ?

గొప్పకి;

"ఫలానా వెంకట్రావు చేతికి ఎమికలేదు."

అనే గొప్పకోసం కాకపోతే మరెందుకలా కాల్చేస్తాడు డబ్బంతా?

ఇప్పుడు తెలిసొచ్చింది.

గొప్పంతా గొరుక్కుపోయింది.

అనుభవించమనండి.

చేతికి ఎమిక లేదట ఎమిక!

అందుకే చిప్ప చేతికొచ్చింది.

నవ్వొచ్చింది రామారావుకి.

ఇద్దరేసి చొప్పున ముగ్గురేసి చొప్పున జనం బీచిని కూర్చున్నారు. ఒంటిగా ఒకచోట కూర్చున్నాడు రామారావు.

"ఇంకా నవ్వొస్తూనే ఉంది రామారావుకి.

"రామారావుగారూ! క్షమించాలి, కిందటిసారి తమర్ని కలుసుకున్నప్పుడు మొహమాటపడి అడగలేకపోయేను."

గారు! తమరు!

"క్రిందటిసారి" అంటే నెలదినాల క్రితం వచ్చేడు వెంకట్రావు.

అప్పుడు -

"ఏమోయ్ రామారావు! కులాసావేనా? పిల్లాజల్లా బావున్నారా? ఏంచేస్తున్నట్టిప్పుడు?"

అలా వెళ్ళింది ధోరణి.

చనవు! రామారావు దగ్గర చనవు తీసుకోబోయేడు.

ది బగర్ హాడ్ దట్ చీక్!

చనవు తీసుకొని పర్సు తెరిపిద్దామనుకున్నాడు, "గట్సు" చాలక జారిపోయేడు.

ఇప్పుడు?

రామారావుగారూ! తమరు!

అందితే సిగ, అందకపోతే కాళ్ళు.

పోనీ, ఈసారైనా తన తాహతేమిటో తెలుసుకొని మాట్లాడేడు.

తెలుసుకోకపోతే తెలియజెప్పగలడు రామారావు - ఎవడికైనా సరే.

తనలో తను నవ్వుకొంటూనే, చలవ కళ్ళజోడు ఎడంచేత్తో తీసి నాలుగువైపులా ఒక్కసారి దృష్టి పోనిచ్చేడు రామారావు.

మిస్టర్ సాహూ వస్తానన్నాడు. ఇంకా రాలేదు. ఇంకా రాలేదా? వచ్చినా కనిపించలేదా? ఎవడో యంగ్‌మాన్‌తో మిసెస్ సన్యాల్ ఒడ్డువైపుకి నడుస్తోంది. ఎవడు వాడు? మరొకడా! అక్కడంత లావుగా కూర్చున్నది పార్థసారథి కాబోలు, వాడు తప్ప అంత దుక్కలా మరెవరుండగలరు! మిష్టర్ హచిన్‌సన్ పిల్లలు కాబోలు, ముగ్గురు, బకెట్లలో తడి ఇసక పట్టుకొచ్చి కు.ప్ప పోస్తున్నారు. వాళ్ళ దగ్గర కుక్కని పట్టుకొని నిల్చున్నావిడ మిసెస్ హచిన్‌సనా? మిస్ రాబిన్‌సనా?

దృష్టి సరిగా ఆనడం లేదే!

రామారావు ముఖంలో నవ్వు మాయమయింది.

ముసలాణ్ణయిపోతున్నానా?

అనే భయం కలిగింది రామారావుకి

సూర్యుడు అస్తమించేడు. చంద్రుడు ఉదయించే ఉన్నాడు. ఎక్కణ్నించో వచ్చే గాలి రివట కెరటాన్ని తాకుతూ ఎక్కడికో పోతోంది. గుంపులోంచి తప్పిపోయి వెనక్కి మిగిలిపోయిన జాలరి పడవ కెరటాల్ని ఎక్కుతూ దిగుతూ తొందరగా ముందుకి రాబోతోంది. లైట్‌హవుస్‌మీది దీపం కన్ను తెరుస్తోంది, మూస్తోంది, మూస్తోంది, తెరుస్తోంది.

బీచి అంతా కూడా చల్లగా రంగురంగుగా ఉంది. సముద్రపు ఘోష అణగినప్పటికీ గంభీరంగా ఉంది. ఆ ఘోషముందు మనుష్యుల గొడవ చప్పగా చల్లారిపోతోంది.

ఈ మధ్య ఒక్కొక్కసారి, ముఖ్యంగా ఒంటరిగా ఉన్న సమయాల్లో రామారావుకి ఈ భయం కలుగుతోంది. గుండెలమీద పాములాగ మనసులో బరువుగా కదుల్తోంది.

నలభయ్యయిదేళ్ళే కదూ వెళ్లేయి.

మరో ముప్పయ్యేళ్ళయినా బతకడా రామారావు?

బతకొచ్చు, ఎందుకు బతకడూ?!

కాని -

ముందుకి కాలం ఇలానే వెళుతుందా?

సరిగా ఇటువంటి సమయంలోనే ఆ ముసల్దాని మాటలు చెవుల్లో గింగురుమంటాయి.

ఒకనాటి మిట్ట మధ్యాహ్నం, ఊరంతా నిప్పులు చెరుగుతూండగా. ఈ చెవిలోంచి గాడ్పు ఆ చెవిలోకి కొడ్తూండగా, రామారావింటి ముందు నిల్చొని, చేతులుజాచి, మూరెడెత్తు ఎగురుతూ, నిప్పు తొక్కిన కోతిలా గెంతుతూ, మండే రాక్షసి బొగ్గులా మండిపడిపోతూ ఓ "ముసలిముండ" రామారావుని తిట్టిన తిట్లు, రామారావు మర్చిపోదామని విశ్వప్రయత్నం చేసినా మర్చిపోలేకుండా ఉన్నాడు.

"నువ్వు దానికేదో అపచారం చేసే ఉంటావు. లేకపోతే నిన్నెందుకలా తిడుతుం దది?"

అంటే ఆ మాటకి రామారావొప్పుకోడు.

ఆ ముసల్దాని కొడుకు రామారావుని దగా చెయ్యబోయేడు, వాడి డబ్బు కొంత రామారావు దగ్గిర ఉంది. ఆ డబ్బు మట్టిపెట్టి ఉంచేడు రామారావు. ఇంతలో వాడు చచ్చిపేడు. ఆ డబ్బు ఇచ్చీమంటుంది ముసిల్ది. ఎందుకివ్వాలి? రామారావుని ఆ వెధవ దగా చెయ్యబోయి ఫెయిలయేడే అనుకోండి కాని, దగా చెయ్యబోయేడా లేదా? అటువంటి వెధవల డబ్బు చేజిక్కిం తరవాత ఎదుకు విడిచిపెట్టాలి?

అందుచేత "లేదు. ఫో"మ్మన్నాడు రామారావు.

ముసిల్ది తారాజువ్వలా లేచింది. తెయ్యిమని గెంతింది.

కాని, ఆ డబ్బు రామారావు దగ్గిరున్నట్లు సాక్ష్యం ఏదీ లేదు.

ఇహ, చేసేదేమీలేక, కడుపుమంట పట్టలేక, తిట్లు తిట్టిపోయింది, ముసల్ది.

ఆ వ్యవహారంలో తన నడత "మోరలీ జస్టిఫయబుల్" కాదని రామారావెన్నడూ అనుకోలేదు. అతని కావిషయంలో క్వామ్స్ ఆఫ్ కాన్షన్స్ లేవు.

కాని -

"ముసలిముండ" తిట్టినతిట్లు;

"నీ ఇంటా పీనుగెళ్ళా, నీమీద అగ్గిపిడుగు పడిపోనూ, నీ వెనకా ముందూ రాలిపోనూ, నీ వంశం నిర్వంశం అయిపోనూ, నువ్వు సర్వనాశనం అయిపోనూ."

ఈ తిట్లు రామారావుని బాధించవు.

కాని, ఇటీవల ఆ ముసల్ది తిట్టిన ఆఖరి తిట్టు, లాల్చీలో పూతిక ఉండి ఉండి గుచ్చుకొన్నట్టుగా, మనసుని గుచ్చుకుంటూ వస్తోంది.

"కాలం మళ్ళదూ? నాకు మళ్ళినట్టే నీకూ మళ్ళుతుంది. అప్పుణ్ణీకు పెద్ద రోగం

రాకపోతే చూసుకోరా కసాయి వెధవా! పచ్చి మంచి నీళ్ళయినా గొంతుకలో పోసేవాళ్లేక, ఈగలైనా వాలక, కుళ్ళికుళ్ళి చస్తావురా; చచ్చినాడా, నువ్వూ! అప్పటిక్కాని తెలిసిరావురా నీ పాపాలన్నీ నీకూ

అంటూ శాపం పెట్టినట్టుగా కేకలేసి తిట్టింది "ముసలిముండ."

నౌఖర్లచేత జుట్టు పట్టించి ఈడ్పించేసే డారోజు దాన్ని.

పిచ్చిముండ!

దాన్నంతకంటె ఏం చెయ్యడం?!

ఈపాటికి చచ్చే ఉంటుంది.

కాని, ఆమె మాటలు రామారావు చెవుల్లో బతికే ఉన్నాయి.

గుండెలమీది సర్పం మరోసారి కదిలింది.

"నిజంగా నేను పాపాల్చేసేనా?"

అనుకున్నాడు రామారావు.

సరిగ్గా అప్పుడే ఆగింది రేడియో గందరగోళం.

మరొక స్టేషన్.

మరొక కంఠం.

మరొక పాట.

కుందనలాల్ సైగల్!!

గాలి పదం తప్పక నడుస్తోంది. కెరటాలు లయ తప్పక విరుగుతున్నాయి. వెన్నెల కరిగి కరిగి జారుతోంది.

కూర్చున్న రామారావు కదల్డం మర్చిపోయేడు.

ఓహో! ఏమిటీ పాట!

ఈ పాటలో –

వెన్నెల వెలుగులున్నాయా? చుక్కల తళుకులున్నాయా? చిక్కటి చీకట్ల నునుపులున్నాయా? కెరటాల విరుపులున్నాయా? ఇంద్రధనుస్సుల రంగులున్నాయా? వేడి కొండల నిట్టూర్పులున్నాయా? జలదాల జలదరింపులున్నాయా?

ఈ పాటలో –

ప్రియురాలి విరహముందా? పడుచు రక్తపు ప్రవాహముందా? స్మృతులే మిగిలిన ముసలివాని బోసినవ్వుందా? పసిపాల హసముందా? కూలివాని కష్టముందా? పేదవాని ఏడుపుందా? సీతాదేవి శోకముందా? రాధేయుని హృదయముందా? అనహాయుని ఆర్తనాదముందా?

ఈ పాటలో ఏవేవో ఉన్నాయి.

ఈ పాటలో ఎన్నెన్నో ఉన్నాయి.

కాని - ఈ పాటలో పాపాల్లేవు.

ఈ పాట పాపాన్నెరగదు.

పాపాన్నెరగని ఆ పాట వినిపించగానే రామారావు గుండెలమీది సర్పం కదిలింది. తల ఎత్తింది. పడగవిప్పింది.

"నిజంగా నేను పాపాల్చేసేనా?"

అని ప్రశ్నించుకొని వేరే సమాధానం చెప్పుకోనక్కర్లేదు.

చేసిన పాపాలు కనిపిస్తూనే ఉన్నాయి.

చనిపోయాయనుకున్న స్మృతులు బ్రతికొస్తూనే ఉన్నాయి. తను కూల్చిన కొంపలు; తను చూపిన సంసారాలు; తన దెబ్బ తిన్న వాళ్ళ ఏడుపు; తనని బ్రతిమలాడి, ప్రాధేయబడి, కాళ్ళు పట్టుకొని, చివరకి చేతులు నులుపుకుపోయిన వాళ్ళ విషణ్ణ వదనాలు; ఆత్మహత్యలు; హాహాకారాలు; కారిన కన్నీటి కాలువలు; రాలిన రక్తపుచుక్కలు; చావులు; మంటలు; ఘోరాలు, ద్రోహాలు, పాపాలు; ఎన్నెన్నో దృశ్యాలు, ఎన్నెన్నో స్మృతులు, వరసగా, ఒక్కొక్కటిగా కనిపించి, లేచి నిల్చొని ముందుకొచ్చి "వీడు నీచాతి నీచుడు; నరరూపరాక్షసుడు, అధమాధముడు; అతి దుర్మార్గుడు; మహా పాతకుడు" అని చేజాచి చూపించి గొంతెత్తి చాటించి చెప్పి పోతున్నాయి.

గుండెలు మండుతున్నాయి.

వళ్ళంతా మండుతోంది.

కడుపులో కల్లోలం.

హృదయంలో సంక్షోభం.

మనసులో భీకర ప్రళయం.

పాట ఎప్పుడు ఆగిందో గుర్తులేదు రామారావుకి.

ఎప్పుడో కాని లేచి నిల్చున్నాడు.

రాత్రయింది. జనసంఖ్య పల్చబడింది. నిల్చొన్న రామారావు దూరం నుంచి చూస్తే కడిగేసిన శిలలా ఉన్నాడు. దగ్గర్నుంచి చూస్తే మనిషంతా నీరయినట్టుగా ఉన్నాడు. వళ్ళంతా చమటపట్టిన మీదట, అప్పుడే గాలి ఒక్క విసురు విసిరిందేమో, అతనికి చల్లగా ప్రాణం లేచి వచ్చినట్లయింది.

ఒక్కసారంటే ఒక్కసారే గంగలో స్నానం చేసేడు రామారావు.

అది కాశీ, చలికాలం మళ్ళింది. కాని ఇంకా చలిచలిగానే ఉంది.

తెల్లవారింది. గంగానది నిర్మలంగానే ప్రవహిస్తోంది. గంటలు ఎన్నో చోట్ల మ్రోగుతున్నాయి. ఎక్కడెక్కణ్ణించో వచ్చిన వాళ్ళంతా దేవుణ్ణి స్మరిస్తున్నారు. నీట్లో మునకలు వేస్తున్నారు. నీట్లోంచీ పైకి లేచిన మెట్లన్నీ తడిసి నీరెండకి మెరుస్తున్నాయి. తడిబట్టలూ,

తడిజుట్టు దులిపినప్పుడు నీటిజల్లులో పంచరంగులు విరుగుతున్నాయి. నదిలో స్నానంచేసి బైటికి వచ్చి మెట్టుమీద నిల్చున్నాడు రామారావు.

అతనికా సమయంలో తనెంతో పరిశుభ్రంగా ఉన్నట్లు భావన కలిగింది.

అతనికప్పుడు మనుష్యులందరి యెడలా సోదరభావం కలిగింది. అతనప్పుడు భగవంతుని తల్చుకొని మిక్కిలి వినమ్రుడయేడు. అతని మనసంతా ఎంతో నిర్మలమయింది. ప్రశాంతత పొందింది.

కొద్దిసేపే కావచ్చు.

ఆ క్షణాన్న ఉజ్వలంగా లేచే సూర్యుణ్ని కూడా కంటితో చూడగలిగేడు.

పాటవిని లేచి నిల్చున్న రామారావుకి తిరిగి అదే విధమైన అనుభూతి కలిగింది.

స్నానం చేసి కలుషాన్నంతా కడిగేసుకున్నట్టుగా అతని మనసంతా పరిశుభ్రపడింది. చల్లనయింది.

పైన, చంద్రుడు బంగారు దీపంలా వెలుగుతున్నాడు. చుక్కలు వజ్రాల రవ్వల్లా మెరుస్తున్నాయి. సముద్రం భక్తుల గుండెల్లా ఉప్పొంగుతోంది. తల్లి చెయ్యిలా గాలి చల్లగా లందర్నీ తాకుతోంది.

"ముందు, వెంకట్రావు ఏమయాడో ఏమో, చూడాలి"

అనుకొంటూ తలవంచుకొని నెమ్మదిగా నడిచేడు రామారావు.

*ఆంధ్రపత్రిక వారపత్రిక 30-6-1954*